నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, శుక్రవారం 14 జూన్ 2024 | RAJANNA SIRCILLA

మెగా డీఎస్సీ జరిగేనా..?

TS DSC Notification

- ప్రమోషన్ల ప్రక్రియ పూర్తయితేనే కొత్త ఖాళీలు
- ఇంకా తొలగని న్యాయపరమైన చిక్కులు
- ఏ క్షణం ఏమి జరుగుతుందో తెలియని ఆందోళన
- టెట్ అర్హత లేకుండా ఇస్తున్న ఉద్యోగోన్నతులపై ఉత్కంఠ
- డీఎస్సీ కోసం కుస్తీ పడుతున్న నిరుద్యోగులు
- పదోన్నతులకు ముడిపెట్టకుండా నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్లు

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పిన కాంగ్రెస్, ఆ దిశగా అడుగులు వేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. నిజానికి గత జనవరిలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తారన్న ప్రచారం జరిగినా నేటి వరకు ఊసే లేదు. మరోవైపు మెగా డీఎస్సీ ఉంటుందా..? లేదా..? అన్నదానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ప్రమోషన్ల ప్రక్రియ సజావుగా పూర్తయితేనే ఖాళీలపై స్పష్టత వచ్చే అవకాశమున్నా.. ఈ ప్రక్రియపై కూడా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఓవైపు టెట్ అర్హత సాధించిన టీచర్లు.. మరోవైపు నాన్ టెట్ ఉపాధ్యాయుల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతుండగా, మెగా డీఎస్సీపై ఉత్కంఠ నెలకొన్నది. ఈ నేపథ్యంలో ప్రమోషన్లు, ట్రాన్స్ఫర్లు వంటి అంశాలను డీఎస్సీకి ముడిపెట్టకుండా నోటిఫికేషన్ ఇవ్వాలన్న డిమాండ్ నిరుద్యోగుల నుంచి వస్తున్నది.

కరీంనగర్, జూన్ 13 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల నేపథ్యంలో మరోసారి టీచర్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) విషయం తెరపైకి వస్తున్నది. 2010 డీఎస్సీకి ముందు నియామకమైన టీచర్లకు టెట్ అర్హతతో సంబంధం లేకుండా ప్రమోషన్లు, ట్రాన్స్ఫర్ల ప్రక్రియ నిర్వహించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రస్తుతం ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అయితే ఈ విషయంలో టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులు మాత్రం అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా, వచ్చే నెలలో ఈ విషయం సుప్రీంకోర్టుకు ముందుకెళ్తున్నది. దీంతో ఎటువంటి పరిణామాలు ఎదురవుతాయో..? అన్న ఉత్కంఠ నెలకొంది.

టెట్ అర్హతపై ప్రచ్ఛన్న యుద్ధం

పాఠశాల విద్యారంగాన్ని పటిష్టం చేయాలన్న లక్ష్యంతో జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్సీటీఈ) పలు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. చాలా రాష్ట్రాల్లో వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు బీఈడీ, టీటీసీ వంటి కోర్సులు పెట్టి సర్టిఫికెట్లు ఇస్తున్నాయని, వాటి ద్వారా నియమితులైన మెజార్టీ ఉపాధ్యాయుల్లో బోధనకు కావాల్సిన సామర్థ్యం, ప్రతిభ, పరిణితి ఉండడం లేదని భావించి 2010లో టెట్ ఉత్తీర్ణతను తెరపైకి తెచ్చింది. ఉపాధ్యాయ ఉద్యోగం పొందాలన్నా, ఉద్యోగం వచ్చిన తర్వాత పదోన్నతి పొందాలన్నా టెట్‌లో ఉత్తీర్ణతను తప్పనిసరి చేసింది. ఆ మేరకు అప్పుడే నిబంధనలను నిర్దేశించింది. ఈ అర్హత సాధించేందుకు సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ముందుగా 2015 వరకు అవకాశం ఇచ్చింది. ఆ తర్వాత మరో ఐదేళ్లు (2019 వరకు) పొడిగించింది. ఆ మేరకు కొత్త నియామకాల్లో ఈ నిబంధనను అమలు చేస్తున్న పాఠశాల విద్యాశాఖ, ప్రమోషన్లకు మాత్రం ఇన్నాళ్లుగా అమలు చేయలేదు. అయితే ఎన్సీటీఈ నిబంధనల ప్రకారం టెట్ అర్హత సాధించిన వారికే ప్రమోషన్లు ఇవ్వాలని పలువురు టీచర్లు కొద్ది నెలల క్రితం హైకోర్టును ఆశ్రయించడంతో అసలు వ్యవహారం తెరపైకి వచ్చింది. ఆ మేరకు పదోన్నతి కోసం టెట్‌లో పాస్ అయిన వారు సీనియారిటీ జాబితా సమర్పించాలని గతేడాది సెప్టెంబర్ 27న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో అప్పుడు ప్రమోషన్లకు బ్రేక్ పడింది. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న నాటి కేసీఆర్ సర్కారు.. ఇప్పటికిప్పుడు టెట్ నిర్వహించడం సాధ్యం కాదని, ఈ సారి పాత నిబంధనల ప్రకారమే పదోన్నతులకు అవకాశం ఇవ్వాలని, అలాగే టీచర్లకు టెట్ నిర్వహించేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరుతూ ఎన్సీటీఈకి లిఖిత పూర్వకంగా లేఖ రాసింది. అయితే ఎన్సీటీఈ మాత్రం ఆ లేఖను అంగీకరించకుండా.. కచ్చితంగా టెట్ అర్హత ఉన్నవారికే ప్రమోషన్లు ఇవ్వాలని అప్పట్లో స్పష్టం చేసింది. ఓవైపు హైకోర్టు ఆదేశించడం, మరోవైపు ఎన్సీటీఈ అంగీకరించక పోవడంతో టెట్ అర్హత తప్పనిసరిగా మారింది. అయితే నాన్‌టెట్ ఉపాధ్యాయులు సైతం ఇదే విషయంలో కోర్టును ఆశ్రయించారు. అయితే 2010 డీఎస్సీ నాటికి నియామకమైన టీచర్లకు టెట్ అర్హతతో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు.. ప్రస్తుతం ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అయితే ఇక్కడ స్పష్టత రావాల్సిం ఉన్నది. కోర్టును ఆశ్రయించిన పిటిషనర్లకు మాత్రమే పదోన్నతులకు చాన్స్ ఇవ్వాలని కోర్టు తీర్పు నిచ్చిందని, కానీ, ప్రభుత్వం అందరికీ అవకాశం కల్పిస్తున్నదని, దీనిపై తమ న్యాయ పోరాటం కొనసాగుతుందని టెట్ ఉపాధ్యాయ అసోసియేషన్ చెబుతున్నది.

గతంలో ఎన్నికలతో నిలిచిన ప్రక్రియ

నిజానికి కేసీఆర్ ప్రభుత్వం గతేడాది ఆగస్టు వరకు ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను గుర్తించింది. అందులో భాగంగా డీఎస్సీ నిర్వహించేందుకు రాష్ట్రంలో 5,089 పోస్టుల భర్తీకి అప్పట్లో నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పుడు స్కూల్ అసిస్టెంట్లు 1,739, బాషా పండిట్లు 611, వ్యాయామ ఉపాధ్యాయులు 164, సెకండరీ గ్రేడ్ టీచర్స్ 2,575 పోస్టులు ఖాళీలుగా ఉన్నట్టు పేర్కొన్నది. ఉమ్మడి జిల్లాలో చూస్తే.. డీఎస్సీలో భాగంగా మొత్తం 393 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. అందులో స్కూల్ అసిస్టెంట్లు 125, ఎస్జీటీలు 176, భాషా పండితులు 72, పీఈటీలు 20 మొత్తం 393 పోస్టులు ఉన్నట్టు చెప్పింది. అందులో అన్నీ కలిపి కరీంనగర్ జిల్లాలో 99, అలాగే జగిత్యాల జిల్లాలో 148, పెద్దపల్లి జిల్లా 43, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 103 పోస్టులను చూపింది. తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో డీఎస్సీ నిలిచిపోయింది.

ఉద్యోగుల్లో ఆందోళన..

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఇది జరగాలంటే ప్రమోషన్ల ప్రక్రియ సజావుగా పూర్తి కావాలి. అది పూర్తయితేనే ఖాళీల సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశమున్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న ఉద్యోగోన్నతుల ప్రక్రియపై కూడా అనేక అనుమానాలకు తావిస్తున్నది. నిజానికి టెట్ అర్హత లేకుండా నిర్వహిస్తున్న ఈ ప్రమోషన్ల ప్రక్రియ శాశ్వతంగా నిలిచే అవకాశం ఉంటుందా..? లేదా..? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వం నిజంగానే మెగా డీఎస్సీ నిర్వహించాలని భావిస్తే పదోన్నతులతో లింకు పెట్టకుండా నేరుగా నోటిఫికేషన్ జారీ చేయవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ లెక్కల ప్రకారం చూస్తే.. రాష్ట్రంలో ఈ యేడాది 3,800 మంది టీచర్లు ఉద్యోగ విరమణ చేయనున్నారు. వాస్తవానికి వారందరూ 2021లోనే పదవీ విరమణ చేయాల్సి ఉండగా ప్రభుత్వం రిటైర్‌మెంట్ వయసును మూడేళ్లు పెంచిన నేపథ్యంలో ఇప్పటివరకు పనిచేస్తూ వచ్చారు. మార్చి నెలాఖరు నుంచి ఉద్యోగ విరమణలు ప్రారంభమయ్యాయి. ఇది రాష్ట్రానికి సంబంధించిన అంశం అయితే.. ఉమ్మడి జిల్లాలో చూస్తే 1,384 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తున్నది. కరీంనగర్ జిల్లాలో 414, జగిత్యాలలో 504, పెద్దపల్లిలో 192, సిరిసిల్లలో 274 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 393 పోస్టులకు ఇవి అదనం కానున్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 1,777 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం ప్రమోషన్లతో సంబంధం లేకుండా.. ప్రస్తుతం క్లియర్‌గా ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇస్తే నిరుద్యోగులకు న్యాయం చేసినట్టు అవుతుంది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తుందని వేలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు డీఎస్సీ కోసం కుస్తీ పడుతున్నారు. ఈ కోణంలో ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఒక వేళ టెట్, నాన్ టెట్ ఉపాధ్యాయుల మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం వల్ల ఏదేని కారణాలతో ప్రమోషన్లు నిలిచిపోయినా.. దానిని సాకుగా చూపి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఆపివేసినా నిరుద్యోగుల నుంచి తీవ్ర నిరసన తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

సిరిసిల్లలో పోలీస్ శాఖ మెగా జాబ్ మేళా

సిరిసిల్లలో యువతికి నియామక పత్రం అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల తెలంగాణ చౌక్, జూన్ 13: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. దీనిని కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. నిరుద్యోగ నివారణ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 60కి పైగా కంపెనీలు రాగా, పెద్ద సంఖ్యలో యువతీయువకులు తరలివచ్చారు. ఇందులో 1746 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. అర్హతలు బట్టి నియామక పత్రాలు అందించారు.

కేంద్రమంత్రిగా బండి సంజయ్ బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న బండి సంజయ్

విద్యానగర్, జూన్ 13: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ గురువారం కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 11గంటలకు ఢిల్లీ నార్త్ బ్లాక్‌లోని కేంద్ర హోంశాఖ కార్యాలయంలో హోం సహాయశాఖ అమాత్యుడిగా బాధ్యతలు తీసుకున్నారు. సహచర మంత్రి నిత్యానందరాయ్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి విద్యారణ్య భారతి హాజరై, ఆశీర్వదించారు. అంతకు ముందు తన అధికారిక నివాసంలో సంజయ్‌ను అభిమానులు, హైదరాబాద్, కరీంనగర్‌కు చెందిన బీజేపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జగిత్యాల: కలెక్టరేట్ ఎదుట బైఠాయించి కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినదిస్తున్న ఆశ కార్యకర్తలు

ఆశ కార్యకర్తల ఆగ్రహజ్వాల

- ఎగ్జామ్స్ నిర్వహించాలనే కాంగ్రెస్ సర్కారు నిర్ణయంపై కన్నెర
- ఉమ్మడి జిల్లాలోని కలెక్టరేట్ల ఎదుట ధర్నా
- ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్

ప్రజా సేవే పరమావధిగా పనిచేసే ఆశ కార్యకర్తలు సర్కారు తీరుపై కదంతొక్కారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం రోడ్డెక్కారు. గురువారం వందలాదిగా తరలివచ్చి ఉమ్మడి జిల్లాలోని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేశారు. ప్రతిభాపాటవాలు పరీక్షించేందుకు, అలాగే కొత్తగా వచ్చే వారికి ప్రవేశ పెట్టిన పరీక్షలను రద్దు చేయాలంటూ నినదించారు. ఎక్కడా లేని విధంగా పారితోషికం లేకుండా కరీంనగర్‌లో చేపట్టిన బీసీజీ సర్వే రద్దు చేయాలని స్పష్టం చేశారు. కనీస వేతనం ₹18వేలు ఇవ్వాలని, అలాగే తమ 24 డిమాండ్లు నెరవేర్చాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

కరీంనగర్‌లోని కలెక్టరేట్ ఎదుట నినదిస్తున్న ఆశ కార్యకర్తలు

కరీంనగర్ కలెక్టరేట్/ సిరిసిల్ల కలెక్టరేట్/ జగిత్యాల, జూన్ 13: కాంగ్రెస్ సర్కారుపై ఆశకార్యకర్తలు మండిపడుతున్నారు. తమ ప్రతిభాపాటవాలు పరీక్షిం చేందుకు పరీక్ష నిర్వహించాలనే రాష్ట్ర సర్కారు నిర్ణయంపై భగ్గుమంటున్నారు. గురువారం కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని కలెక్టరేట్ల ఎదుట నిరసన తెలిపారు. కరీంనగర్‌లో తెలంగాణ ఆశ కార్యకర్తల యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎడ్ల రమేశ్, సంఘం జిల్లా అధ్యక్షురాలు రంగవేని శారద, ప్రధానకార్యదర్శి మారెళ్ల శ్రీలత ఆధ్వర్యంలో 150 మంది, జగిత్యాలలో సీఐటీయూ జగిత్యాల జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన, ఆశ యూనియన్ అధ్యక్షురాలు ఆత్మకూరి లత, కార్యదర్శి మమత, రాజన్న సిరిసిల్లలో సీఐటీయూ రాజన్నసిరిసిల్ల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి కోడం రమణ, జిల్లా నాయకులు ఎలిగేటి రాజశేఖర్, అన్నల్దాస్ గణేశ్, గురజాల శ్రీధర్, ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా కార్యదర్శి జయశీల, అధ్యక్షురాలు భారతి తదితరులతో కలిసి ఆశకార్యకర్తలు ఆందోళన చేశారు.

హామీలు అమలు చేయాల్సిందే

ఆశ కార్యకర్తలకు పరీక్ష నిర్వహించాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఆశ కార్యకర్తల యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు సత్వరమే అమలు చేయాలని కోరారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా అందజేస్తున్న పారితోషికం పెంచడంతో పాటు కనీసం వేతనం ₹18వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్యకర్తకు ₹50లక్షల బీమా వర్తింప చేయాలని, మట్టి ఖర్చుల కింద ₹50వేలు చెల్లించాలని, విరమణ ప్రయోజనం కింద ₹5లక్షలు చెల్లించడమే కాదు ఇస్తున్న పారితోషకంలో సగం పెన్షన్ రూపేణా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ ఏరియర్స్, లెప్రసీ సర్వే డబ్బులు కూడా సత్వరమే చెల్లించాలన్నారు. పోటీ పరీక్షలతో పాటు సాధారణ పరీక్షల్లో కూడా విధులు నిర్వహిస్తున్నందున డబ్బులు విడుదల చేయాలని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రసూతి సెలవులు కల్పిస్తూ, సర్క్యులర్ విడుదల చేయాలన్నారు. ప్రతి ఏటా 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు కల్పించాలని, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ లీవ్స్ అవకాశం కూడా కల్పించాలని కోరారు. సకాలంలో యూనిఫామ్స్ అందజేయాలని, పారితోషికం లేని పనులు, ఏఎన్ఎంల పనులు తమకు అప్పగించవద్దని స్పష్టం చేశారు. ఇక రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కరీంనగర్ జిల్లాలో మాత్రమే క్షయవ్యాధి నియంత్రణ కోసం బీసీజీ సర్వే పేరిట కొత్త సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. సుమారు రెండు దశాబ్దాలుగా గ్రామా లు, బస్తీల్లో బీపీ, షుగర్, థైరాయిడ్, మాతాశిశు సంరక్షణ చర్యలను చేపడుతున్నారని, తాజాగా మరిన్ని వ్యా ధులు చేర్చడం దారుణమని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్‌ను కలిసేందుకు సంఘ నాయకురాళ్లు వెళ్లారు. జిల్లా అధ్యక్షురాలు రంగవేని శారద, ప్రధానకార్యదర్శి మారెళ్ల శ్రీలత పాల్గొన్నారు.

ఉపసంహరించుకోకుంటే ఆందోళనే

ఆరోగ్య సిబ్బందికి దీటుగా మేం గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు వైద్య సేవలందిస్తున్నం. కరోనా కష్టకాలంలో తమ సేవలను గుర్తించిన నేషనల్ హెల్త్ ఆర్గనైజేషన్ హెల్త్ గ్లోబల్ లీడర్లుగా తమను అభివర్ణించింది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తమను అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక కరివేపాకులా తీసేస్తుంది. ప్రతిభా పాటవ పరీక్షలు, కొత్తగా చేరేవారికి ప్రవేశపరీక్షలంటూ నూతన సంస్కరణలకు ఆజ్యం పోస్తున్నది. వెంటనే ఉపసంహరించుకోవాలి. లేకుంటే ఆందోళనలు తప్పవు.

- మారెళ్లి శ్రీలత, తెలంగాణ అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి

చినుకు జాడేది?

నైరుతి రుతుపవనాలు వచ్చినా కురవని వర్షాలు • ఆకాశంవైపు ఆశగా చూస్తున్న రైతులు

'సినుకమ్మా.. వాన సినుకమ్మా.. నేల చిన్నబోయె సూడు బతుకమ్మ' అంటూ మళ్లీ వర్షాల కోసం మళ్లీ ఎదురు చూసే రోజులు వచ్చాయి. వానకాలం ప్రారంభమైనా.. నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చినా.. ఆకాశంలో మేఘాలు రోజూ దట్టంగా కమ్ముకుంటున్నా వాన జాడ మాత్రం కానరావడం లేదు. మృగశిర కార్తెకు ముందు మూడు రోజుల పాటు అక్కడక్కడా చిరుజల్లులతో కురిసినా ఆ తర్వాత మళ్లీ కురవలేదు. అసలైన తొలకరి పలకరింపు కోసం అన్నదాతలు ఆశగా ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో విత్తనాలు వేయాలా..? వద్దా..? అసలు వర్షాలు కురుస్తాయా..? కురవవా..? అనే ఆందోళన రైతుల్లో నెలకొన్నది.

పెద్దపల్లి, జూన్ 13(నమస్తే తెలంగాణ) : మృగశిర కార్తె తర్వాత వ్యవసాయ పనులను మొదలు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్తె నుంచి తొలకరి వర్షాలు సమృద్ధిగా కురిసేవి. కానీ, ఈ కార్తెకు ముందు ఈ నెల 3, 6, 7 తేదీల్లో జిల్లా వాప్తంగా చిరు జల్లులు పడగా, ఆ తర్వాత ముఖం చాటేశాయి. వారం రోజులుగా రోజూ మేఘాలు కమ్ముకొస్తున్నాయి. ఉరుములు, మెరుపులు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. అయితే, అంతలోనే గాలులు వీస్తుండడంతో మేఘాలు తేలిపోతున్నాయి. రోజూ ఇదే పరిస్థితి ఉంటున్నది. వర్షాలు కురుస్తాయని ఆకాశం వైపు ఎదురు చూడడం, అంతలోనే మేఘాలు మాయమవుతుండడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. నైరుతి రుతు పవనాల రాకతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతుండడంతో ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఒకటి రెండు భారీ వర్షాలు కురవగానే విత్తనాలు వేయాలని చూస్తున్నారు. కాగా, అక్కడక్కడ కురిసిన చిరు జల్లులతో దుక్కులు సిద్ధం చేసుకుంటుండగా, మరికొన్ని చోట్ల విత్తనాలు వేశారు. చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ దుక్కులు కూడా దున్నలేదు.

విత్తనం వేయాలా..? వద్దా..? : కొన్ని ప్రాంతాల్లో దుక్కులు దున్నిన రైతులు విత్తనం వేయాలంటే వెనకాముందవుతున్నారు. విత్తనం వేసిన తర్వాత వర్షాలు కురవకపోతే మొలకలు రాక మట్టిలోనే విత్తనం మురిగిపోతుందని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు లేకపోవడంతో ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంది. దీంతో చాలా మంది రైతులు విత్తనం వేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. ముఖ్యంగా మక్క, సోయా, పత్తి, మినుము, పెసర, కంది వంటి ఆరుతడి పంటలు సాగు చేసే రైతులు ఆచితూచి అడుగులేస్తున్నారు. విత్తనం వేసిన తర్వాత సకాలంలో వర్షాలు కురవకపోతే వేసిన విత్తనం నష్టపోవాల్సి వస్తుందని భావిస్తున్నారు.

ఎస్సారెస్పీలో 7.56 టీఎంసీలే : ఉత్తర తెలంగాణ వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో 90 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి కేవలం 7.56 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. దీంతో ఈ వానకాలం పంటకు వర్షాలు పడితే తప్పా సాగు నీరు ఇచ్చే అవకాశం ఏ మాత్రం కనిపించడం లేదు. దీనికి తోడు పెద్దపల్లి జిల్లాలో గోదావరినదిపై నిర్మించిన సరస్వతీ, పార్వతీ బ్యారేజీల్లోని నీటిని పూర్తిగా ఎత్తివేయగా ఎల్లంపల్లి డెడ్ స్టోరేజీకి చేరుకున్నది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్టుల ఆయకట్టుకు భరోసా లభిస్తుంది. పెద్దపల్లి జిల్లాలో 1072 వరకు చిన్న, పెద్ద చెరువులు, కుంటలు ఉండగా.. చాలా వరకు ఎడారులను తలపిస్తున్నాయి.

పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి రోడ్డు వద్ద పొలంలో బోరు వేసుకుంటున్న రైతు

నారుమడులకూ నీటి కరువు : ఎస్సారెస్పీ ప్రాజెక్టు కింద పెద్దపల్లి జిల్లాలో 2.8 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలోని 1072 చెరువుల్లో అత్యధిక శాతం చెరువులు ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గొలుసుకట్టుగా నింపే అవకాశాలు ఉన్నా ఎస్సారెస్పీలో నీరే లేదు. దీంతో నారు మడులు కూడా వర్షాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

బోర్ల వైపు చూపు : ఇన్నాళ్లు ప్రాజెక్టులపై ఆధారపడి సాగు చేసుకున్న రైతులు ప్రస్తుత ప్రభుత్వ తీరు వల్ల సాగునీరందడం కష్టమేననే ఆలోచనలో పడ్డారు. ఇన్నిరోజులు బోర్లకు దూరంగా ఉన్నా.. ఇప్పుడు క్రమంగా వాటి వైపు మల్లుతున్నారు. సాగునీరు అందే దారి లేక వ్యవసాయ పొలాల్లో బోర్లు వేయించే పనిలో పడారు.

సాగు నీటికి ప్రతిపాదనలు పంపాం

ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి కాలువలకు సాగు నీటి విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. పెద్దపల్లి జిల్లాలో 2 లక్షల 8 వేల ఎకరాల వరకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగవుతున్నది. ఇందుకు నీటి అవసరాన్ని వివరించాం. వర్షాలు కురిస్తే చాలా వరకు ప్రయోజనం ఉంటుంది. ఎస్సారెస్పీ ఎగువన వర్షాలు సమృద్ధిగా కురిసినా నీరందుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీరు విడుదల చేసే అవకాశం లేదు.

- సత్యరాజ్ చంద్ర, నీటిపారుదలశాఖ ఎస్ఈ (పెద్దపల్లి)

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

కమాన్‌చౌరస్తా, జూన్ 13 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్ ఫలితాలను విడుదల చేసినట్లు కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జగిత్యాలలో 17.99 శాతం, పెద్దపల్లిలో 33.94 శాతం, కరీంనగర్‌లో 42.15 శాతం, రాజన్న సిరిసిల్లలో 89.23 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు చెప్పారు. అలాగే, ఇంటర్‌లో జగిత్యాలలో 37.38 శాతం, పెద్దపల్లిలో 46.04 శాతం, కరీంనగర్‌లో 58.39 శాతం, రాజన్న సిరిసిల్లలో 72.69 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వివరించారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571